https://trinetnews.com/

# ట్రైనెట్ న్యూస్

నిజం • బాధ్యత • నిబద్ధత

తెలుగు దిన పత్రిక

తాజా తెలుగు వార్తలు

ప్రతి 3 గంటలకు

98497 67747 | 9494184136

7 AM TO 10 AM

సంపుటి: 01 / సంచిక:25 / పేజీలు :02 / వేల:2/రూ / ఎడిటర్: వెంకటేశ్వర్లు రాపోలు / గురువారం, సెప్టెంబర్ 10,2026



## రాహుల్‌కు ఇటాలియన్‌లో లేఖ..

### ఫీజు బకాయిలపై బీజేపీ చీఫ్ వినూత్న నిరసన

రాహుల్ గాంధీకి ఇటాలియన్ భాషలో లేఖ రాసిన తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు

ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యపై వినూత్నంగా నిరసన

రూ.15 వేల కోట్ల బకాయిలతో 40 లక్షల మంది విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని ఆరోపణ

విద్యార్థులకు మద్దతిస్తే ప్రభుత్వం అరెస్టులు చేస్తోందని విమర్శ

కాంగ్రెస్ యూత్ డిక్లరేషన్ హామీలను నెరవేర్చలేదని విమర్శలు

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 10

తెలంగాణలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల సమస్యపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దృష్టిని ఆకర్షించేందుకు బీజేపీ సీనియర్ నాయకులు ఎన్. రామచందర్ రావు వినూత్న నిరసన చేపట్టారు. బుధవారం ఆయన రాహుల్ గాంధీకి ఇటాలియన్ భాషలో లేఖ రాశారు. రాష్ట్రంలో సాగుతున్న ఆందోళనలు, విద్యార్థుల నిరసనలు, పోలీసుల లాఠీఛార్జులు, అరెస్టులు వంటివేవీ రాహుల్ గాంధీని గానీ, తెలంగాణ ప్రభుత్వాన్ని గానీ కదిలించలేకపోయాయని, అందుకే ఆయన "మాతృభాష" అయిన ఇటాలియన్‌లో లేఖ రాస్తున్నట్లు రామచందర్ రావు ఈ సందర్భంగా ఎద్దేవా చేశారు.రాష్ట్రంలో సుమారు రూ.15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పేరుకుపోయాయని, దీనివల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీ మరియు ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన దాదాపు 40 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలో పడిందని ఆయన ఆరోపించారు. ప్రభుత్వం బకాయిలు చెల్లించకపోవడంతో కళాశాల యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని, ఫలితంగా విద్యార్థులు ఉన్నత చదువులకు, ఉద్యోగ అవకాశాలకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిధుల కొరతతో విద్యాసంస్థల యాజమాన్యాలు, అధ్యాపకులు, సిబ్బంది కూడా అరకొర వేతనాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు.ఈ అంశంపై విద్యార్థులకు మద్దతుగా నిలిస్తే రాష్ట్ర ప్రభుత్వం అరెస్టులు, పోలీసు చర్యలతో అణచివేస్తోందని రామచందర్ రావు విమర్శించారు. సమస్య పరిష్కారం కోసం గళమెత్తినందుకు గత 10 రోజుల్లోనే తనను నాలుగుసార్లు అరెస్టు చేశారని ఆయన గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 'యూత్ డిక్లరేషన్'లో ఇచ్చిన నిరుద్యోగ భృతి, ఉద్యోగాల భర్తీ, విద్యా భరోసా కార్డుల వంటి హామీలను నెరవేర్చలేదని ఆయన దుయ్యబట్టారు.

## మధు యాష్కీకి జాతీయ పదవి..

### ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ చైర్మన్‌గా నియామకం

- మేరకు ఉత్తర్వులు జారీ చేసిన కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే
- తెలంగాణ ఎన్నికల ప్రచార కమిటీ చైర్మన్‌గా పనిచేసిన యాష్కీ
- ఇటీవలి ఎన్నికల్లో ఓటమి తర్వాత జాతీయ స్థాయిలో కీలక బాధ్యతలు
- మాజీ చైర్మన్ ప్రవీణ్ చక్రవర్తి సేవలను ప్రశంసించిన పార్టీ

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 10



తెలంగాణ కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ మధు గౌడ్ యాష్కీకి జాతీయ స్థాయిలో కీలక బాధ్యతలు లభించాయి. ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ (ఏఐపీసీ) నూతన చైర్మన్‌గా ఆయనను కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నియమించారు. ఈ మేరకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత వ్యవహారాలు) కేసీ వేణుగోపాల్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటివరకు చైర్మన్‌గా పనిచేసిన ప్రవీణ్ చక్రవర్తి సేవలను పార్టీ ఈ సందర్భంగా ప్రశంసించింది.2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్‌గా కీలక పాత్ర పోషించినప్పటికీ, ఎల్బీ నగర్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. అయినప్పటికీ, కాంగ్రెస్ అధిష్ఠానానికి అత్యంత సన్నిహితుడిగా పేరున్న యాష్కీకి జాతీయ స్థాయిలో పదవి లభించడం గమనార్హం.నిజామాబాద్ లోక్‌సభ స్థానం నుంచి 2004, 2009లలో వరుసగా రెండుసార్లు ఎంపీగా గెలుపొందిన మధు యాష్కీ, ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి గట్టి మద్దతుదారుగా నిలిచారు. కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ చీఫ్ విప్‌గా కూడా ఆయన సేవలు అందించారు. అయితే, 2014, 2019 లోక్‌సభ ఎన్నికలతో పాటు, 2023 అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఆయన ఓటమి చవిచూశారు.తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి, రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ఖాళీ అయిన టీపీసీసీ అధ్యక్ష పదవికి మధు యాష్కీ పేరు ప్రముఖంగా వినిపించింది. అయితే, అధిష్ఠానం ఆ బాధ్యతలను మహేశ్ కుమార్ గౌడ్‌కు అప్పగించింది. ఈ నేపథ్యంలో తాజాగా ఆయనకు జాతీయ పదవి దక్కడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

## డ్రోన్ దాడి నుంచి తృటిలో తప్పించుకున్న ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 10



ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదమిర్ జెలెన్‌స్కీ కి పెను ప్రమాదం తప్పింది. డ్రోన్ దాడి నుంచి ఆయన తృటిలో తప్పించుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి నార్వే(చీశీతీషవస్త్రఖుఅ)ప్రధాని జోనాస్ గార్ స్టోర్ వివరాలను వెల్లడించారు. నార్వే రాజు హెరాల్డ్ అంత్యక్రియల కోసం జెలెన్‌స్కీ విమానంలో మోల్డోవా నుంచి ఓస్లోకు బయలుదేరారు. జెలెన్‌స్కీ మోల్డోవా నుంచి ఓస్లోకు బయలుదేరుతున్నప్పుడు జెలెన్‌స్కీ విమానాన్ని ఒక డ్రోన్ దాదాపు ఢీకొట్టేంత పని జరిగిందన్నారు.'మోల్డోవా నుండి బయలుదేరుతున్నప్పుడు జెల్‌న్‌స్కీ విమానాన్ని ఒక డ్రోన్ దాదాపు ఢీకొట్టింది. ఆయన జీవిస్తున్న రియాలిటీ ఇదే" అని స్టోర్ నార్వే ప్రభుత్వ ప్రసార సంస్థ ఎన్‌ఆర్‌కేకు తెలిపారు. యుద్ధం మధ్యలో ఉక్రెయిన్ అధ్యక్షుడు ఎదుర్కొంటున్న క్లిష్ట పరిస్థితులను ఈ ఘటన ఎత్తిచూపిందని స్టోర్ తెలిపారు. ఈ చర్య తీవ్ర ఆందోళను కలిగిస్తుందని స్టోర్ పేర్కొన్నారు. మరిన్ని వివరాలు వెల్లడించేందుకు స్టోర్ నిరాకరించారు.కాగా, జెలెన్‌స్కీ మంగళవారం సాయంత్రం ఓస్లో చేరుకున్నారు. అక్కడ జెలెన్‌స్కీ... నార్వే ప్రధాని స్టోర్, ఆర్థిక మంత్రి జెన్స్ స్టోల్టెన్‌బర్గ్, విదేశాంగ మంత్రి ఎస్పెన్ బార్త్ ఐడెలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఉక్రెయిన్‌కు నార్వే సైనిక సహాయం, వాయు రక్షణ మద్దతుతో సహా, పౌర సహాయంపై కీలకమైన చర్చలు జరిపారు. ఈ సమావేశాల్లో ఉక్రెయిన్‌కు అదనపు వైమానిక రక్షణ వ్యవస్థ అవసరం వంటి అంశాలపై ఇరువురు నేతలు లోతుగా చర్చించారు. అయితే దీనిపై ఇంకా ఎటువంటి తుది నిర్ణయం తీసుకోలేదని స్టోర్ తెలిపారు. అలాగే నార్వే రాజు హెరాల్డ్ అంత్యక్రియల అనంతరం జెలెన్‌స్కీ, నార్వే నుంచి బయలుదేరి కెనడాకు వెళ్లి అక్కడి నాయకులతో చర్చలు జరపనున్నారని స్టోర్ ఎన్‌ఆర్‌కేతో చెప్పారు.

## రాజ్‌భవన్‌కు చేరిన మాజీ మంత్రి జోగి రమేశ్ కుటుంబ వివాదం



- గవర్నర్‌ను కలిసి రక్షణ కల్పించాలని కోరిన కోడలు మేఘన
- వరకట్నం కోసం వేధిస్తూ, హత్యాయత్నం చేశారని ఫిర్యాదు
- జోగి రమేశ్ సహా 11 మంది కుటుంబ సభ్యులపై ఇప్పటికే కేసు నమోదు
- కేసును తెలంగాణకు బదిలీ చేసుకోవాలని గవర్నర్ సూచిన?

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 10

మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నేత జోగి రమేశ్ కుటుంబ వివాదం మరో కీలక మలుపు తిరిగింది. ఆయన కోడలు మేఘన, ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను కలిసి తన గోడు వెళ్లబోసుకున్నారు. తన భర్త, అత్తమామల నుంచి ప్రాణహాని ఉందని, తనకు తక్షణమే రక్షణ కల్పించాలని ఆమె గవర్నర్‌ను అభ్యర్థించారు. వరకట్న వేధింపులు, హత్యాయత్నం వంటి తీవ్ర ఆరోపణలతో ఆమె గవర్నర్‌కు ఫిర్యాదు చేయడం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.విజయవాడలోని రాజ్‌భవన్‌లో గవర్నర్‌తో భేటీ అయిన మేఘన, తన అత్తమామలు అదనపు కట్నం కోసం తీవ్రంగా వేధిస్తున్నారని ఆరోపించారు. తన భర్త రాజీవ్, మామ జోగి రమేశ్, అత్త శకుంతల సహా కుటుంబ సభ్యులు తనపై పలుమార్లు హత్యాయత్నం చేశారని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలుస్తోంది. తన వాదనలు విన్న గవర్నర్, ఈ కేసును తెలంగాణకు బదిలీ చేసుకుంటే న్యాయపోరాటానికి సులభంగా ఉంటుందని సూచించినట్లు సమాచారం.ఈ ఏడాది జులైలో మేఘన తొలిసారిగా ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. పెళ్లి సమయంలో తన కుటుంబం రూ.5 కోట్లు ఖర్చు చేసినప్పటికీ, అదనంగా మరో రూ.5 కోట్లు, కార్లు, ఆభరణాలు తీసుకురావాలని వేధిస్తున్నారని ఆమె ఆరోపించారు. గోవా పర్యటనలో పడవ నుంచి నీటిలోకి నెట్టేసి చంపేందుకు ప్రయత్నించారని కూడా ఆమె గతంలో ఆరోపించారు. దీంతో జోగి రమేశ్ సహా 11 మందిపై వరకట్న వేధింపులు, గృహ హింస, హత్యాయత్నం కింద కేసు నమోదైంది.అయితే, ఈ ఆరోపణలను జోగి రమేశ్ కుటుంబం ఖండించింది. ఇది కేవలం కుటుంబ వివాదమని, దానికి రాజకీయ రంగు పులుముతున్నారని వారు పేర్కొన్నారు. ఈ కేసులో ఇప్పటికే కొందరు నిందితులు ముందస్తు బెయిల్ పొందారు.



## అమెరికాలో మధ్యంతర ఎన్నికల అనంతరం ఇరాన్ యుద్ధాన్ని ఆపుతుంది : డొనాల్డ్ ట్రంప్

ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 10

అమెరికా లో మధ్యంతర ఎన్నికలు ముగియగానే ఇరాన్ తో నెలకొన్న ఉద్రిక్తతలు సమసిపోతాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. అమెరికా ఎన్నికలను ప్రభావితం చేసేందుకే టెహ్రాన్ ఈ పోరాటాన్ని ఉద్దేశపూర్వకంగా సాగదీస్తోందని ఆరోపించారు. బుధవారం రాత్రి డల్లాస్ పర్యటన నిమిత్తం ఎయిర్ ఫోర్స్ వన్ లో బయలుదేరే ముందు ఆయన విలేకరులతో మాట్లాడారు."ఎన్నికల తర్వాత ఈ పోరు తక్షణమే ముగియబోతోందని నేను భావిస్తున్నా" అని ట్రంప్ పేర్కొన్నారు. ఇందుకు గల కారణాన్ని వివరిస్తూ.. "వారు ఇక ఎంతమాత్రం నిలదొక్కుకోలేరు. అమెరికాలో ఒక బలహీనమైన ప్రభుత్వాన్ని అధికారంలోకి తెచ్చి, వారిని ప్రభావితం చేయడం ద్వారా అణ్వాయుధాన్ని సొంతం చేసుకోవాలని ఇరాన్ తీవ్రంగా ప్రయత్నిస్తోంది" అని వ్యాఖ్యానించారు. ఇరాన్ అణ్వాయుధాలను కలిగి ఉండటం యావత్ ప్రపంచానికే పెను ప్రమాదమని ఆయన ఈ సందర్భంగా మరోసారి హెచ్చరించారు.ప్రపంచవ్యాప్తంగా ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 100 డాలర్ల మార్కును దాటడానికి ఇరాన్‌తో కొనసాగుతున్న ఘర్షణలే ప్రధాన కారణమని ట్రంప్ ఆరోపించారు. ఎన్నికల అనంతరం చమురు, గ్యాసోలిన్ ధరలు భారీగా తగ్గుతాయని, గ్యాసోలిన్ ధరను గ్యాలన్‌కు 2 డాలర్ల కంటే తక్కువకు తీసుకువస్తామని ఆయన హామీ ఇచ్చారు. అయితే ఈ ధరల తగ్గుదల మధ్యంతర ఎన్నికలకు ముందే సాధ్యం కాకపోవచ్చని ఆయన అంగీకరించారు. ప్రస్తుతానికి ఇరాన్‌తో చర్చలు జరిపే యోచన లేదని, అయితే భవిష్యత్తులో ఆ అవకాశాన్ని పూర్తిగా కొట్టిపారేయలేమని ట్రంప్ స్పష్టంచేశారు."నిజానికి నేను మొదట ఒక ఒప్పందం చేసుకోవాలనుకున్నా, కానీ ఇప్పుడు పరిస్థితులు చాలా ముందుకు వెళ్లాయి. ఆ దేశం ప్రస్తుతం అత్యంత బలహీన స్థితిలో ఉంది, అందుకే మేము చర్చల కోసం ఆత్రుత చూపడం లేదు" అన్నారు. కేవలం అణు ఒప్పందానికే పరిమితం కాకుండా అంతకంటే పెద్ద లక్ష్యాన్ని నిర్దేశించుకున్నామని, రాబోయే రోజుల్లో మరిన్ని అంశాలు చర్చకు వస్తాయని తెలిపారు. గత ఏడు నెలలుగా కొనసాగుతున్న ఈ ఘర్షణల్లో భాగంగా హర్మూజ్ జలసంధి వద్ద జరిగిన దాడుల్లో అమెరికా దళాలు ఇరాన్‌కు చెందిన తొమ్మిది నౌకలను, ట్యాంకర్లను ధ్వంసం చేశాయని ట్రంప్ వెల్లడించారు. కాగా, అమెరికా మధ్యంతర ఎన్నికలు నవంబర్ 3న జరగనున్నాయి.

## టీవీ9 మాజీ సీఈవో రవిప్రకాశ్‌కు సుప్రీంకోర్టులో

# చుక్కెదురు

- ▶▶ 9 మాజీ సీఈవో వి. రవిప్రకాశ్‌కు సుప్రీంకోర్టులో చుక్కెదురు
- ▶▶ ఆయనపై నమోదైన ఫోర్జరీ కేసులపై హైకోర్టు తీర్పులో జోక్యానికి నిరాకరణ
- ▶▶ కేసుల ఉపసంహరణను రద్దు చేసిన హైకోర్టు తీర్పును సమర్థించిన అత్యున్నత న్యాయస్థానం
- ▶▶ విచారణను ఎదుర్కోవాల్సిందేనని స్పష్టం చేసిన కోర్టు
- ▶▶ అలాందా మీడియా ఫిర్యాదుతో 2019లో నమోదైన ఈ కేసులు



**ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 10**

టీవీ9 వ్యవస్థాపకుడు, మాజీ సీఈవో వి. రవిప్రకాశ్‌కు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. అసోసియేటెడ్ బ్రాడ్‌కాస్టింగ్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్ (ఏబీసీపీఎల్) యాజమాన్య హక్కుల వివాదంలో ఆయనపై నమోదైన ఫోర్జరీ, మోసం, కుట్ర ఆరోపణలకు సంబంధించిన రెండు క్రిమినల్ కేసులను పునరుద్ధరిస్తూ తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పులో జోక్యం చేసుకోవడానికి సర్వోన్నత న్యాయస్థానం నిరాకరించింది. జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మసీహ్‌లతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై సెప్టెంబర్ 9న విచారణ జరిపింది. తెలంగాణ హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకోవడానికి ఎలాంటి ఆధారాలు కనబడలేదని స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు నిర్ణయంతో రవిప్రకాశ్‌పై నమోదైన రెండు క్రిమినల్ కేసుల విచారణ యథావిధిగా కొనసాగనుంది.

### కేసు నేపథ్యం ఏమిటి?

టీవీ9 బ్రాండ్‌తో ఛానళ్లను నిర్వహిస్తున్న ఏబీసీపీఎల్‌లో యాజమాన్య మార్పు సందర్భంగా ఈ వివాదం మొదలైంది. 2018లో అలందా మీడియా సంస్థ ఏబీసీపీఎల్‌లో 90.54% వాటాను కొనుగోలు చేసింది. అనంతరం అలందా మీడియా ప్రతినిధి పి. కౌశిక్ రావు 2019లో సైబరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు రెండు వేర్వేరు ఫిర్యాదులు చేశారు. నటుడు శివాజీకి రూ.20 లక్షలకు 40,000 ఈక్విటీ షేర్లను విక్రయించినట్లు రవిప్రకాశ్ ఒక నకిలీ ఒప్పంద పత్రాన్ని సృష్టించారని క్రైమ్ నెం. 84/2019లో ఆరోపించారు. కొత్త యాజమాన్యాన్ని అడ్డుకునేందుకే ఈ ఫోర్జరీ పత్రాలను ఉపయోగించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ కేసును కూకట్‌పల్లి కోర్టు స్వీకరించి, సీసీ నెం. 9286/2022గా విచారణ జరుపుతోంది. రెండో ఫిర్యాదు (క్రైమ్ నెం. 87/2019) ప్రకారం, కంపెనీ సెక్రటరీ దేవేందర్ అగర్వాల్ సంతకాన్ని రవిప్రకాశ్ ఫోర్జరీ చేశారని ఆరోపించారు. కొత్త డైరెక్టర్ల నియామకాన్ని అడ్డుకోవడానికి, దేవేందర్ అగర్వాల్ రాజీనామా చేసినట్లు ఒక తప్పుడు పత్రాన్ని రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్ వద్ద అప్‌లోడ్ చేశారని ప్రాసిక్యూషన్ వాదించింది. ఈ కేసు సీసీ నెం. 9288/2022గా విచారణలో ఉంది.

### ప్రభుత్వ ఉపసంహరణ ప్రయత్నం, హైకోర్టు జోక్యం

ఈ కేసులు విచారణలో ఉండగా, 2024 మార్చి 15న తెలంగాణ ప్రభుత్వం వాటిని ఉపసంహరించుకోవాలని నిర్ణయించింది. ప్రాసిక్యూషన్‌కు విజయావకాశాలు తక్కువగా ఉన్నాయని, ఇది సివిల్ వివాదం లాంటిదని పేర్కొంటూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. దీని ఆధారంగా కూకట్‌పల్లి కోర్టు 2024 జూన్ 8న కేసుల ఉపసంహరణకు అనుమతి ఇచ్చింది. అయితే, కౌశిక్ రావు ఈ నిర్ణయాన్ని తెలంగాణ హైకోర్టులో సవాలు చేశారు. దీనిపై విచారణ జరిపిన జస్టిస్ ఈ.వి. వేణుగోపాల్, 2025 ఫిబ్రవరి 25న ట్రయల్ కోర్టు ఉత్తర్వులను కొట్టివేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ ప్రభుత్వ ఆదేశాలను గుడ్డిగా పాటించారని, కేవలం "పోస్ట్ ఆఫీస్"లా వ్యవహరించారని హైకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. కేసులను పునరుద్ధరించి, విచారణను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించింది. హైకోర్టు తీర్పును రవిప్రకాశ్ సుప్రీంకోర్టులో సవాలు చేయగా, తాజాగా ఆయన పిటిషన్‌ను ధర్మాసనం తోసిపుచ్చింది. ఈ నిర్ణయంతో కేసుల విచారణలో రవిప్రకాశ్ దోషి లేదా నిర్దోషి అని తేలలేదు. కేవలం ట్రయల్ కోర్టులో విచారణ కొనసాగాలని మాత్రమే సుప్రీంకోర్టు స్పష్టం చేసినట్లయింది.


# కరెంట్ కోసం నీళ్లివ్వం..

## తెలుగు రాష్ట్రాలకు కేఆర్ఎంబీ స్పష్టీకరణ

- సాగు, తాగునీటికే మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని కేఆర్ఎంబీ ఆదేశం
- ఎల్ నినో ప్రభావంతో నీటిని పొదుపుగా వాడాలని తెలుగు రాష్ట్రాలకు సూచన
- నీటి పంపకాలపై ఏపీ, తెలంగాణ మధ్య మరోసారి భగ్గుమన్న విభేదాలు
- 66:34 నిష్పత్తిలో నీరు కేటాయించాలని కోరుతున్న ఆంధ్రప్రదేశ్
- 50:50 వాటా కావాలని డిమాండ్ చేస్తున్న తెలంగాణ

**ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 10**

ఎల్ నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా శ్రీశైలం, నాగార్జున సాగర్ జలాశయాల్లోని నీటిని అత్యంత పొదుపుగా వినియోగించుకోవాలని ఉభయ తెలుగు రాష్ట్రాలకు కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) సూచించింది. ఉమ్మడి జలాశయాల నుంచి కేవలం విద్యుదుత్పత్తి కోసం నీటిని విడుదల చేయడం సాధ్యపడదని స్పష్టం చేసింది. తాగునీటికి ప్రథమ, సాగునీటికి ద్వితీయ ప్రాధాన్యం ఇచ్చిన తర్వాతే మిగిలిన అవసరాలను పరిగణనలోకి తీసుకోవాలని బోర్డు తేల్చి చెప్పింది. ఈ మేరకు సెప్టెంబరు 4న కేఆర్ఎంబీ సభ్య కార్యదర్శి సతీశ్ కంబోజ్ నేతృత్వంలో జరిగిన త్రిసభ్య కమిటీ సమావేశ మినిట్స్‌ను బోర్డు ఇరు రాష్ట్రాలకు పంపింది. 2026 సెప్టెంబరు నుంచి 2027 ఆగస్టు వరకు సాగునీటి కేటాయింపులపై ఈ సమావేశంలో ఏకాభిప్రాయం కుదరలేదు. ఈ అంశాన్ని త్వరలో జరగనున్న 21వ కేఆర్ఎంబీ పూర్తిస్థాయి సమావేశంలో చర్చించనున్నారు. అయితే, ఈ సమావేశ మినిట్స్‌లో వాస్తవాలను పొందుపరచలేదని, వాటిని తాము అంగీకరించడం లేదని తెలంగాణ నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ రమేశ్ బాబు కేఆర్ఎంబీ ఛైర్మన్‌కు లేఖ రాశారు. మరోవైపు, తమ రాష్ట్రంలో తాగునీటి సరఫరా, చెరువుల నింపడం కోసం వచ్చే ఏడాది ఆగస్టు వరకు 104 టీఎంసీల నీరు అవసరమని ఆంధ్రప్రదేశ్ ఈఎన్‌సీ బోర్డుకు విన్నవించారు. సెప్టెంబరు 3 నాటి నీటి నిల్వల ప్రకారం 66:34 నిష్పత్తిలో తమ వాటాకు రావాల్సిన 97.41 టీఎంసీలను తక్షణమే విడుదల చేయాలని కోరారు. దీనికి భిన్నంగా, నీటి పంపిణీ 50:50 ప్రాతిపదికన జరగాలని తెలంగాణ ఈఎన్‌సీ డిమాండ్ చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం-2014లోని షెడ్యూల్ 12 ప్రకారమే నీటి వినియోగ ప్రాధాన్యతలను నిర్దేశించినట్లు బోర్డు స్పష్టం చేసింది.






## ఫిలిప్పీన్స్ పడవలో ఘోర అగ్నిప్రమాదం..

# ఐదుగురు మృతి, 87 మంది గల్లంతు

**ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 10**

ఫిలిప్పీన్స్‌లోఘోర అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. పలవాన్ ప్రావిన్స్‌లోని పర్యాటక కేంద్రం సమీపంలో 134 మందితో ప్రయాణిస్తున్న ఓ ప్యాసింజర్ ఫెర్రీలోఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో ఐదుగురు మరణించగా, 87 మంది ఆచూకీ తెలియకుండా పోయిందని స్థానిక అధికారులు తెలిపారు. ఈ ఘటనలో 42 మందిని రక్షించినట్లు వివరించారు. వారిలో 38 మంది ప్రయాణికులు, నలుగురు సిబ్బంది ఉన్నారని చెప్పారు. గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. వివరాల్లోకి వెళ్తే.. ఎంవీ జూన్ ఆస్టర్ అనే ప్యాసింజర్ ఫెర్రీ మనీలా నుంచి పలావాన్ ప్రావిన్స్‌లోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన కోరన్‌కు బయలుదేరింది. బరంగే మార్సిల్లా తీరానికి సుమారు 2.2 కిలోమీటర్ల దూరంలో ప్రయాణి స్తుండగా ఒక్కసారిగా ఫెర్రీలో అగ్నిప్రమాదం సంభవించింది. సమాచారం అందుకున్న వెంటనే ఫిలిప్పీన్ కోస్ట్ గార్డ్ రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టింది. ఇప్పటివరకు 38 మంది ప్రయాణికులు, నలుగురు సిబ్బందితో కలిపి మొత్తం 42-43 మందిని సురక్షితంగా కాపాడినట్లు అధికారులు తెలిపారు. ఐదు మృతదేహాలను స్వాధీనం చేసుకుని తీరానికి తరలించారు. ఇంకా 87 మంది ఆచూకీ తెలియాల్సి ఉందని, వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని కోస్ట్ గార్డ్ కెప్టెన్ నోయెమీ కాయబ్యాబ్ వెల్లడించారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఫెర్రీలో సంభవించిన అగ్నిప్రమాదం వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేసినట్లు తెలిపారు. ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలు ఇంకా తెలియరాలేదని, దీనిపై దర్యాప్తు జరుగుతోందని అధికారులు తెలిపారు.

# మూసీ ప్రక్షాళనకు కౌంట్‌డౌన్..

## దసరా రోజు తొలి దశ పనులకు శ్రీకారం!



- దసరాకు మూసీ తొలి దశ పనులకు శంకుస్థాపన చేసేందుకు ఏర్పాట్లు
- మొదటి విడత కోసం రూ.7,345 కోట్లతో ఇప్పటికే పరిపాలన అనుమతులు

**ట్రైనెట్ న్యూస్, సెప్టెంబర్ 10**

- ఏడీబీ నుంచి రూ.4,500 కోట్ల రుణ సమీకరణ.. మంజూరు ప్రక్రియ చివరి దశలో
- ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ నుంచి బాపూఘాట్ వరకు అభివృద్ధి పనులు
- నదిలో బోటింగ్, ఇరువైపులా రోడ్లు, సైకిల్ ట్రాక్‌ల నిర్మాణం చేపట్టనున్న ప్రభుత్వం

హైదరాబాద్ వాసులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టు పనులకు ముహూర్తం దాదాపు ఖరారైంది. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ఈ ప్రాజెక్టు తొలి దశ (ఫేజ్-1) పనులను దసరా పండుగ రోజున ప్రారంభించేందుకు ప్రభుత్వ యంత్రాంగం వేగంగా ఏర్పాట్లు చేస్తోంది. హైదరాబాద్ నగరానికి కొత్త అందాలు తీసుకువచ్చే ఈ ప్రాజెక్టుకు సంబంధించి అన్ని ప్రక్రియలను అధికారులు వేగవంతం చేశారు. తొలి దశ పనుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రూ.7,345.12 కోట్లతో పరిపాలన అనుమతులు జారీ చేసింది. ఈ భారీ ప్రాజెక్టుకు అవసరమైన నిధులలో రూ.4,500 కోట్లను ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఏడీబీ) నుంచి రుణంగా తీసుకోనున్నారు. మిగిలిన రూ.2,845.12 కోట్లను హెచ్ఎండీఏ, టీజీఐఐసీ సంస్థల ద్వారా సమకూర్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే అధికారులు ఫేజ్-1 సమగ్ర ప్రాజెక్టు నివేదికను (డీపీఆర్) ఏడీబీకి సమర్పించగా, రుణ మంజూరు ప్రక్రియ చివరి దశలో ఉన్నట్లు సమాచారం. దీంతో దసరా నాటికి శంకుస్థాపన చేసేందుకు రంగం సిద్ధమవుతోంది.

### రెండు మార్గాల్లో అభివృద్ధి పనులు

మూసీ నది వాస్తవానికి అనంతగిరి కొండల్లో మూసా, ఈసీ అనే రెండు పాయలుగా పుడుతుంది. ఈసీ నదిపై హిమాయత్‌సాగర్, మూసా నదిపై ఉస్మాన్‌సాగర్ (గండిపేట) జలాశయాలు ఉన్నాయి. ఈ రెండు జలాశయాల నుంచి దిగువకు ప్రవహించి, లంగర్‌హౌజ్ సమీపంలోని బాపూఘాట్ వద్ద కలిసిపోయి మూసీ నదిగా ప్రవహిస్తుంది. ఫేజ్-1లో భాగంగా, హిమాయత్‌సాగర్ నుంచి బాపూఘాట్ వరకు 9.2 కిలోమీటర్లు, ఉస్మాన్‌సాగర్ నుంచి బాపూఘాట్ వరకు 11.8 కిలోమీటర్ల మేర అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ఈ రెండు పనులను ఒకేసారి పూర్తిచేసేలా ప్రణాళికలు రచిస్తున్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా నదిలో పేరుకుపోయిన పూడిక, వ్యర్థాలను తొలగించడం, నీటిని నిల్వ చేసి బోటింగ్ వంటి సదుపాయాలు కల్పించడం, నదికి ఇరువైపులా సుందరమైన రోడ్లు, ల్యాండ్‌స్కేపింగ్, సైకిల్ ట్రాక్‌లు, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు నిర్మించనున్నారు. ముఖ్యంగా, నగరంలోని మురుగు నీరు నదిలో కలవకుండా ఇరువైపులా భారీ ట్రంక్ లైన్లు, వర్షపు నీటి డ్రెయిన్లను ఏర్పాటు చేయనున్నారు. ఫేజ్-1 పనులు ప్రారంభమైన తర్వాత, హైదరాబాద్ గేట్‌వే నిర్మాణ పనులపై దృష్టి సారిస్తామని అధికారులు చెబుతున్నారు. మరోవైపు, నాగోలు నుంచి గౌరెల్లి వరకు చేపట్టనున్న రెండో దశ (ఫేజ్-2) పనుల డీపీఆర్ తయారీ ప్రక్రియను కూడా వేగవంతం చేశారు.